సాక్షి
జనగామ

గురువారం । 23 । జనవరి । 2025



విద్యతోనే సమాజంలో గుర్తింపు

విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు.

- 8లో▸



మిలిటరీ వ్యూహాల్లో టెక్నాలజీ కీలకం

మిలిటరీ వ్యూహాల్లో కంప్యూటర్ టెక్నాలజీ కీలక భూమిక వహిస్తుందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
26°/19°

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

'వైట్ టీషర్ట్' ఉద్యమానికి సంఘీభావం



జనగామ: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన వైట్ టీషర్టు ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ మద్దతు తెలిపారు. ఈ మేరకు బుధవారం సంఘీభావం ప్రకటించి కాంగ్రెస్ నాయకులతో కలిసి వైట్ టీషర్ట్ ధరించి పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఎన్‌ఆర్‌ఐ ఆర్థిక సాయం



స్టేషన్‌ఘన్‌పూర్: కంబోడియా దేశంలో జరిగే ఏషియన్ పారాత్రోబాల్ పోటీలకు వెళ్లే తానేదార్‌పల్లికి చెందిన దివ్యాంగ క్రీడాకారిణి మాచర్ల కృష్ణవేణికి ఎన్‌ఆర్‌ఐ హరీశ్‌రెడ్డి రూ.90 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు. కృష్ణవేణి పారాత్రోబాల్ ఏషియన్ పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె మార్చి 28 నుంచి 30 వరకు కంబోడియాలో జరిగే పోటీలకు వెళ్లడానికి దాతల సాయం కోరగా.. హరీశ్‌రెడ్డి స్పందించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్‌గౌడ్ తదితరులు చొరవ తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, శివాజీ, రమేష్, సంపత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోవుడే.. వచ్చుడు లేదు

- చివరి దశకు ఉపాధ్యాయ, ఉద్యోగుల బదిలీలు
- జిల్లాలో 391 ఉపాధ్యాయ ఖాళీలు
- డీఎస్సీ తర్వాతే భర్తీకి నిర్ణయం



జనగామ: ఉపాధ్యాయ, ఉద్యోగుల బదిలీలు చివరి దశకు చేరుకున్నాయి. జిల్లా నుంచి 55 మంది మ్యూచువల్ బదిలీకి హనుమకొండకు ఆప్షన్ ఇచ్చుకోగా.. అక్కడి నుంచి ఇక్కడికి రావడానికి ఒక్కరు కూడా ఆప్షన్ పెట్టుకోలేదు. అందరికీ ట్రాన్స్‌ఫర్ రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వగా.. నేడు వెళ్లిపోనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చింది. స్పౌజ్(భార్యాభర్తలు ఒకేచోట పని చేసే అవకాశం)తో పాటు మ్యూచువల్ బదిలీలకు సంబంధించిన ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్‌లో విడుదల చేసిన 317 జీఓతో స్థానికతను కోల్పోయామని ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. జీఓలో సడలింపు ఇవ్వాలని నాటి సర్కారుకు వినతులు సమర్పించగా 2022 సంవత్సరంలో మ్యూచువల్ బదిలీలకు అవకాశం కల్పించారు. ఇందులో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించని వారు అక్కడే ఉండి పోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో అధికారంలోకి వచ్చిన వెంటనే 317 జీఓ నిబంధనలను పరిశీలిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా కల్పించారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్పౌజ్, మ్యూచువల్ బదిలీలపై మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యాన చర్చించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి బదిలీల ప్రక్రియను ప్రభుత్వం మొదలు పెట్టింది.

స్పౌజ్ బదిలీలతో 391 ఖాళీలు

ప్రస్తుత ఉపాధ్యాయ స్పౌజ్ బదిలీలతో 391 ఖాళీలు ఏర్పడగా ఇందులో ఎస్జీటీలు 208, లాంగ్వేజ్ పండిట్లు 3, పీఎస్ హెచ్‌ఎం 9, గెజిటెడ్ హెచ్‌ఎం 13, బయోలాజికల్ సైన్స్ 15, ఇంగ్లిష్ 4, ఎస్‌ఏ హిందీ 12, ఎస్‌ఏ గణితం 8, ఫిజికల్ డైరెక్టర్లు 4, ఫిజికల్ సైన్స్ 2, ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ 15, ఎస్‌ఏ సాంఘిక 13, ఎస్‌ఏ తెలుగు 15, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ 12, ఉర్దూ 3 ఖాళీలు ఉండగా.. పదోన్నతులు కల్పించి మిగతా పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు.



డీఈఓ కార్యాలయంలో మ్యూచువల్ బదిలీ సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

55 మంది మ్యూచువల్.. 62 మంది స్పౌజ్

జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయలకు సంబంధించి స్పౌజ్ కేటగిరీలో 62, మ్యూచువల్ బదిలీలకు సంబంధించి 55 మంది ఉన్నారు. ఉద్యోగులు(స్పౌజ్ -7, మ్యూచువల్-4), ఉపాధ్యాయులు(స్పౌజ్ -55, మ్యూచువల్-51) బదిలీల కోసం ఆప్షన్ ఇవ్వగా.. స్పౌజ్‌కు సంబంధించి రిలీవింగ్ ఆర్డర్లు ఇచ్చారు. జిల్లా నుంచి మ్యూచువల్ కోసం 55 మంది ఉపాధ్యాయులు హనుమకొండకు ఆప్షన్ ఇవ్వగా.. అక్కడి నుంచి రావడానికి ఒక్కరు కూడా ఆప్షన్ ఇచ్చుకోలేదు. దీంతో జిల్లాలోని ఎస్జీటీ కేటగిరీలో 43, గణితం(ఎస్‌ఏ, తెలుగు మీడియం)-2, ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎస్‌ఏ, తెలుగు మీడియం)-2, ఇంగ్లిష్-2(ఎస్‌ఏ), ఎస్జీటీ ఉర్దూ-2, స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) విభాగంలో బయోసైన్స్, తెలుగు, ఫిజికల్ సైన్స్, ఎస్జీటీ తెలుగు ఒకరి చొప్పున బదిలీకి రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వగా.. డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతోంది.

దివ్యాంగులకు రుణాలు

జనగామ రూరల్: దివ్యాంగులు జీవనోపాధి పొందడానికి రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకుతో సంబంధం లేకుండా నూరుశాతం రాయితీతో రూ.50వేల చొప్పున జిల్లాకు 13 యూనిట్లు మంజూరయ్యాయని, అర్హులు వెబ్‌సైట్‌లో ఫిబ్రవరి 2లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వైకల్యం 40 శాతానికి మించి ఉంటే మెడికల్ బోర్డ్ సర్టిఫికెట్, వయసు 21 నుంచి 55 ఏళ్ల మధ్య ఉన్నవారు అర్హులని తెలిపారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం రూ.2.00 లక్షలు ఉండాలన్నారు. గడిచిన ఐదేళ్లలో సబ్సిడీ పొందని వారు అర్హులని చెప్పారు.

నిలదీత.. కాగితాల చించివేత

- జాబితాలో పేర్లు లేవని ప్రజల ఆగ్రహం
- కొట్టుకున్న అధికార, ప్రతిపక్ష నాయకులు
- మళ్లీ దరఖాస్తులా అంటూ విసుగు చెందిన ప్రజలు
- రసాభాసగా రెండోరోజు గ్రామసభలు



వడ్లకొండలో ఘర్షణ పడుతున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు

- వివరాలు 8లో▸

పేదలకే మొదటి ప్రాధాన్యం

- జాబితాలో పేరుండగానే ఇల్లు మంజూరైనట్లు కాదు
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- లింగాలఘణపురంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితా పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

జనగామ/లింగాలఘణపురం: సంక్షేమ పథకాల్లో నిరుపేదలు, పేదలకే మొదటి ప్రాధాన్యం కల్పిస్తాం.. జాబితాలో పేరుండగానే ఇల్లు మంజూరైనట్లు కాదని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ప్రజాపాలన గ్రామసభలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల అర్హుల జాబితాను ప్రకటించిన సమయంలో అర్హుల పేర్లు కాకుండా అనర్హుల పేర్లు రావడంపై జిల్లా వ్యాప్తంగా గ్రామసభల్లో ఆందోళనలు జరిగాయి. ఈ మేరకు 'నిలదీతలు..నిరసనలు' శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. మండల కేంద్రాన్ని సందర్శించిన ఆయన గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పరిశీలించారు. అర్హుల పేర్లు ఎందుకు రాలేదని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌ను అడిగారు. ప్రజాపాలన దరఖాస్తులపై సర్వే చేపట్టిన సమయంలో ఇళ్లులేని వారు స్లాబ్ ఉన్న ఇంట్లో అద్దెకు ఉండగా జాబితాలో పేరు రాలేదని.. ఆర్థికంగా ఉన్న ధనవంతుల ఇళ్ల పైకప్పులు పెంకులు, రేకులు ఉండగా ఫొటోలు అప్‌లోడ్ చేస్తే అర్హులుగా జాబితాలో వచ్చారని వివరించారు. ఈ విషయాన్ని ఇల్లు లేని ఓడపల్లి రమేశ్ కలెక్టర్‌కు విన్నవించగా.. ఇలాంటి వారు ఎందరున్నారో తిరిగి అర్హుల జాబితాలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే ఇళ్లులేని వారు స్లాబ్ ఇళ్లలో అద్దెకు ఎంత మంది ఉన్నారో పరిశీలించి అర్హుల జాబితాలో చేర్చాలని చెప్పారు. అనర్హులుంటే జాబితా నుంచి తొలగించి కారణాలను వారికి ఫోన్ ద్వారా వివరించాలని పేర్కొన్నారు. ప్రజాపాలన దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదుకాని అర్హులుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, సర్వే నిర్వహిస్తారని వివరించారు. ప్రస్తుతం ప్రకటిస్తున్న జాబితా కేవలం దరఖాస్తుదారుల ఇళ్ల స్థితిగతులను తెలుసుకోవడానికేనని, వీరందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు కాదని స్పష్టం చేశారు. కలెక్టర్‌తో ఆర్డీఓ గోపీరాం, డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- గ్రామ సభల్లో ప్రతీ అంశం వివరించాలి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి.. గ్రామ సభల్లో ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా వివరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి గ్రామ సభల నిర్వహణపై జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక నిరంతరం కొనసాగుతుందని, జాబితాల్లో పేర్లు లేనివారు గ్రామ/వార్డు సభల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ సభలకు హాజరు కాలేకపోతే ఎంపీడీఓ కార్యాలయంలోనూ దరఖాస్తు సమర్పించవచ్చని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, వార్డులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని, హెల్ప్‌డెస్కుల ద్వారా కొత్త దరఖాస్తులు, సర్వే పరిశీలన అభ్యంతరాలను స్వీకరించాలని అన్నారు. సమీక్షలో జెడ్పీ సీఈఓ మాధురీ షా, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, డిప్యూటీ సీఈఓ సరిత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ వసంత, డీపీఓ స్వరూప, డీసీఎస్ఓ సరస్వతి, డీఏఓ రామారావునాయక్ తదితరులు పాల్గొన్నారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా

28న జాబ్‌మేళా

గూడూరు: ఈ నెల 28న ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీయువకులకు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఏటూరునాగారం ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాకు పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, డీఫార్మసీ, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ చదివిన నిరుద్యోగులు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వివరాలకు సెల్ 8330954571 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌కు కేయూ మహిళా జట్టు



కేయూ జట్టుతో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య

కేయూ క్యాంపస్ : మైసూర్ యూనివర్సిటీలో ఈనెల 23నుంచి 28వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేశామని స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య బుధవారం తెలిపారు. ఈజట్టులో ఎం నవ్య (కెప్టెన్), జి మోహనశ్రీ, జె. అనూష ,బి. నవ్య, బి.లీషా, టి. అశ్వత, వి. సుజాత వై.రచిత, ఎం. దాత్రిశ్రీ, పి. సరిత, ఎస్. జయశ్రీ, ఎస్. తుష్మరేఖ, డి. యశస్విని, ఎం. సౌమ్యశ్రీ, పి. శ్రీనిధి, బి. మంజుల ఉన్నారని వెంకయ్య తెలిపారు. ఈ జట్టుకు హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎండి. అఫ్జల్ కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని వెంకయ్య తెలిపారు.

మధుప్రియపై కేసు నమోదు చేయాలి

- దేవస్థానం కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కాళేశ్వరం: కాళేశ్వరం దేవస్థానం గర్భగుడిలో సింగర్ మధుప్రియ ప్రైవేట్ పాట చిత్రీకరించిన నేపథ్యంలో ఆమెతో పాటు బృందంపై కేసు నమోదు చేయాలని రాష్ట్ర బీజేపీ నాయకుడు చల్లా నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం కార్యాలయం ఎదుట కార్యకర్తలతో బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈఓ, మధుప్రియ, వారి బృంద సభ్యులపై దేవాదాయ శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ, సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత దేవస్థాన అధికారులపై ఉందన్నారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకు ముందు దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, ఆర్జేసీ రామకృష్ణరావుతో ఘటనపై మాట్లాడారు. చర్యలు తీసుకోవాలని విన్నవించారు. మండల అధ్యక్షుడు మనోజ్, కిషన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అధికారులతో వాగ్వాదం



హిమ్మత్‌నగర్‌లో అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

జఫర్‌గఢ్: అనర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారంటూ ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. మండల పరిధి హిమ్మత్‌నగర్‌లో బుధవారం గ్రామ సభలో ఏఓ కరుణాకర్‌రెడ్డి, ఆర్ఐ అనిల్‌బాబు, ఇతర అధికారులు పథకాలకు సంబంధించి జాబితాలు చదివి వినిపించారు. ఈ క్రమంలో అర్హుల పేర్లు జాబితాలో లేవంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగడంతోపాటు.. చేతిలో ఉన్న కాగితాలను అధికారులపై విసిరారు. నచ్చజెప్పే ప్రయత్నం చేసినా శాంతించకపోవడంతో గ్రామ సభను గందరగోళం మధ్యే ముగించారు. తమ్మడపల్లి(జి), తిమ్మంపేట, సూరారం, తిమ్మాపూర్ గ్రామ సభల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఎస్సై రామ్‌చరణ్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో రసాభాస..



ఛాగల్లులో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు లేదని కంటతడి పెడుతున్న మహిళ

స్టేషన్‌ఘన్‌పూర్: మండల పరిధి స్టేషన్‌ఘన్‌పూర్, నమిలిగొండ, ఛాగల్లు, చంద్రుతండా, కోమటిగూడెం గ్రామాల్లో గ్రామసభలు రసాభాసగా మారాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లో సభకు హాజరైన ప్రజలు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. లబ్ధిదారులను ఇష్టారాజ్యంగా ఎంపిక చేశారని మండిపడ్డారు. ఛాగల్లు, నమిలిగొండ తదితర గ్రామాల్లోనూ ఇదేతంతు కనిపించింది. ఛాగల్లులో ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అర్హులకు అన్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ మండల నాయకుడు కనకం గణేష్ ప్రశ్నించగా కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. 'ఉపాధి కూలీగా పనిచేస్తున్నాను.. కూలిపోయిన ఇంటిలో నివాసం ఉంటున్నాను.. జాబితాలో తన పేరు లేదు' అంటూ సభావేదిక వద్ద ఓ మహిళ కన్నీటి పర్యంతమైంది.

అర్హులకు ఎందుకు ఇవ్వడంలేదు..?



బచ్చన్నపేటలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామానికి చెందిన ప్రజలు

బచ్చన్నపేట : సంక్షేమ పథకాలను అర్హులందరికీ ఎందుకు ఇవ్వడం లేదని పలువురు అధికారులను నిలదీశారు. మండల పరిధి కేసిరెడ్డిపల్లి, పోచన్నపేట, బచ్చన్నపేట, కట్కూర్ గ్రామాల్లో బుధవారం జరిగిన గ్రామ సభల్లో పలు పార్టీల నాయకుల మధ్య గొడవలు కూడా జరిగాయి. బచ్చన్నపేటలో ఇందిరమ్మ ఇల్లు రాలేదని పస్తం స్వరూప కన్నీరు పెట్టుకున్నది. దీంతో సభకు వచ్చిన ప్రజల్లో చాలా మంది అధికారులను నిలదీశారు. సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. మండల స్పెషలాఫీసర్ రామారావునాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిలదీత.. కాగితాల చించివేత

- జాబితాలో పేర్లు లేవని ప్రజల ఆగ్రహం
- రసాభాసగా రెండో రోజు గ్రామసభలు

సంక్షేమ పథకాల అర్హుల జాబితాకు ప్రజల ఆమోదం తీసుకునేందుకు చేపట్టిన గ్రామ సభలు రసాభసాగా మారాయి. మొదటి రోజు నిలదీతలు–నిరసనలతో మొదలవగా.. రెండోరోజు బుధవారం అదే తంతు కొనసాగింది. అర్హుల జాబితాపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధికార, ప్రధాన ప్రతిపక్ష నాయకులు ఒకరినొకరు కొట్టుకోగా.. అర్హుల పేర్లు లేని జాబితా ఎందుకంటూ చించివేశారు. నిరసనలు, కంటతడి, ఆవేదనల మధ్య సాగిన గ్రామ సభల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ప్రజల ప్రశ్నలకు అధికారులు జవాబు చెప్పలేక ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారంతో పోలీసులు బందోబస్తు చేపట్టారు. జిల్లాలో రెండోరోజు 92 జీపీలు, మున్సిపల్ వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించగా.. 14,451 మంది హాజరయ్యారు. ఆయా పథకాల కోసం 9,693 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు.

– జనగామ



సిద్దెంకిలో అర్హుల జాబితా చించివేస్తున్న గ్రామస్తుడు

బుధవారం గ్రామసభల వివరాలు	
గ్రామ సభలు:	92
రేషన కార్డుల దరఖాస్తులు:	4,159
ఇందిరమ్మ ఇళ్లు:	3,635
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా:	1,275
రైతు భరోసా:	209
మొత్తం	9,370

జనగామ రూరల్: జనగామ మండల పరిధి గానుగుపహాడ్, వడ్లకొండ, సిద్దెంకి, పెద్దపహాడ్, ఓబుల్‌కేశ్వాపూర్, మరిగడి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలు రసాభాసగా సాగాయి. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హుల పేర్లు రాలేదని.. భూమి ఉన్న వారికి వచ్చాయంటూ వడ్లకొండ సభలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు గొడవపడ్డారు. ఘర్షణకు దారితీయడంతో ఇరువర్గాల వారు కొట్టుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సీఐ దామోదరరెడ్డి, ఎస్సై రాజేశ్ చేరుకుని గొడవ పెద్దది కాకుండా చర్యలు చేపట్టారు. అలాగే సిద్దెంకి గ్రామంలో తమ పేరు రాలేదని ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా పత్రాలను చించివేశారు. గానుగుపహాడ్ రైతు వేదికలో నిర్వహించిన సభలో పథకాల్లో తమ పేర్లు రాలేదని ప్రజలు ఆందోళన చేశారు. మరిగడి, ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామ సభల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే తప్పుగా ఉందని, ఇంకెన్నిసార్లు దరఖాస్తు చేయాలంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను నిలదీసే ప్రయత్నం చేశారు.

అధికారులకు ప్రశ్నల వర్షం

కొడకండ్ల : మండలంలో ప్రజాపాలన గ్రామసభలు నిరసన, నిలదీతల మధ్య జరిగాయి. రంగాపురం, కడగుట్టతండా, మొండ్రాయి, మైదంచెరువుతండా, నర్సింగాపురం గ్రామ సభల్లో మాజీ సర్పంచ్‌లు, ప్రజలు అధికారులను ప్రశ్నించారు. పథకాల మంజూరు విషయం తెలుపకుండా జాబితాల్లోని పేర్లను చదవడమేంటని నిలదీశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం దాటవేత ధోరణిని అవలంభిస్తుందని మండిపడ్డారు. రైతు భరోసా ఇంత వరకు ఇవ్వలేదు.. ఎందరికి ఇళ్లు మంజూరయ్యాయి.. కొత్త రేషన్‌కార్డుల జాబితాలు లేకుండా సభలు నిర్వహించడం ఏమిటని ప్రజలు ప్రశ్నించారు.

జాఫర్‌గూడెంలో గందరగోళం

రఘునాథపల్లి: మండల పరిధి జాఫర్‌గూడెంలో బుధవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో జాబితాను చదువుతుండగా గందరగోళం నెలకొంది. సంక్షేమ పథకాలకు 280 మంది దరఖాస్తు చేసుకుంటే 60 దరఖాస్తులను అకారణంగా తిరస్కరించారని ప్రజలు మండిపడ్డారు. గృహజ్యోతి అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభను బహిష్కరిస్తామని ఆందోళన చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, ఎస్సై దూదిమెట్ల నరేష్ కలుగ జేసుకుని తిరస్కరణకు గురైన వారి వివరాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో సభ కొనసాగింది.

తప్పుల తడకగా జాబితా..



బొంతగట్టునాగారంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

తరిగొప్పుల: తప్పుల తడకగా లబ్ధిదారుల జాబితా తయారు చేశారని మండల పరిధి బొంతగట్టునాగారం, కొత్తతండా, భోజ్యాతండా, మరియపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. అనంతరం తహసీల్దార్ నాగేశ్వరచారి మాట్లాడుతూ జాబితాలోని తప్పులను సరిచేయడానికే ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకే చెందుతాయన్నారు. ప్రజల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. ప్రత్యేక అధికారి రాణాప్రతాప్, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఏఓ మనోహిత్ విక్రమరావు, ఆర్ఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై ర్యాండమ్ సర్వే

- జాబితాలో సవరణకు చర్యలు..?



ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై సర్వే నిర్వహిస్తున్న హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్

లింగాలఘణపురం: ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హుల పేర్లు లేకపోవడంపై హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్ మండల కేంద్రంలో బుధవారం ర్యాండమ్ సర్వే నిర్వహించారు. గ్రామసభల్లో ప్రజల నుంచి విముఖత వ్యక్తమవుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో పరిశీలించారు. సర్వే సమయంలో అధికారులకు కేటాయించిన యాప్‌లో ఇంటి పైకప్పు పెంకులు, రేకులతో ఉంటే పేరు అర్హుల జాబితాలో వచ్చింది. వీరిలో ధనవంతులు కూడా ఉన్నారు. ఇక ఇల్లు లేకుండా ఆర్‌సీసీ భవనంలో అద్దెకున్న నిరుపేదల పేర్లు జాబితాలో రాలేదు. అలాగే గతంలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన, యజమాని పేరుతో కారు, ట్రాక్టర్, ఇతర ఫోర్ వీలర్ వాహనం రిజిస్టర్ అయిఉన్న, అర్బన్ ఏరియాలో సొంత ఇల్లు కలిగి వారి పేర్లు కూడా అర్హుల జాబితాల్లో ఉన్నాయి. దీనిపై హౌసింగ్ చీఫ్ ఇంజనీర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా ఆర్‌సీసీ భవనం శిథిలావస్థలో ఉన్నా, అందులో అద్దెకున్న అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంతో యాప్ సవరణకు చర్యలు తీసుకునేందుకు అధికారులు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మండల కేంద్రంలో ఇలాంటి ఆర్‌సీసీ భవనాలపై సర్వే నిర్వహించి 81 మంది ఉన్నట్లు గుర్తించి నివేదిక ప్రభుత్వానికి అందజేశారు. ఈ సర్వేలో చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్‌తో పాటు ఆర్‌డీఓ గోపీరాం, డీపీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

జేఈఈ మెయిన్స్ ప్రారంభం..

- తొలిసెషన్‌లో 1,220 మంది, రెండో సెషన్‌లో 1,225 మంది హాజరు

విద్యారణ్యపురి: జాతీయ విద్యా సంస్థలు ఐఐటీ, నిట్‌లలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు జరగుతున్నాయి. హనుమకొండ, వరంగల్‌లో కలిపి 5 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. హనుమకొండలోని జయ ఇంజనీరింగ్ కళాశాల, హసన్‌పర్తిలోని ఆయాన్ డిజిటల్ జోన్, భీమారంలోని మోక్షిత కంప్యూటర్స్, భీమారంలోని చింతగట్టు టెక్నాలజీ సొల్యూషన్స్, వరంగల్‌లోని బొల్లికుంట ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రాలుగా ఉండగా పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈనెల 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో పరీక్షలు జరుగుతాయి. మొత్తం 7,542 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. తొలిరోజు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన సెషన్‌లో మొత్తం 1,252 మందికిగాను 1,220 మంది హాజరయ్యారు. రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారు. 1,259 మంది విద్యార్థులకు 1,225మంది హాజరైనట్లు జేఈఈ మెయిన్స్ సిటీ కోఆర్డినేటర్ కె.శ్రీలతారెడ్డి తెలిపారు. పరీక్షలకు నిర్దేశించిన సమయం కంటే రెండు గంటల ముందునుంచే కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. ఉదయం సెషన్‌లో 8.30 గంటలకు, మధ్యాహ్నం 2.30కి కేంద్రాల గేట్లు మూసివేశారు. హాల్ టికెట్ అడ్మిట్‌కార్డుతోపాటు ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన సెల్ఫ్‌డిక్లరేషన్, పాస్‌ఫొటో, ఒరిజనల్ గుర్తింపు కార్డులు పరిశీలించిన అనంతరమే అనుమతించారు.

లక్ష మందితో బీసీ యుద్ధభేరి సభ

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2న నిర్వహించనున్న బీసీ యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కేయూ దూరవిద్య కేంద్రంలోని జాఫర్ నిజాం సెమినార్‌హాల్‌లో బీసీ విద్యార్థి సంఘాలు, విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం జరుగుతోందని, అందుకే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. లక్షమందితో జరగబోయే బీసీ యుద్ధభేరి బహిరంగసభకు బీసీలు ఐక్యంగా తరలివచ్చి సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలోని బీసీ విద్యార్థులంతా తరలిరావాలన్నారు. సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ మేడారపు సుధాకర్, నరేశ్, బీసీ విద్యార్థి సంఘం బాధ్యులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత దూరవిద్య కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలువేశారు. అంతకుముందు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో సభాస్థలిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతోపాటు వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి, బీసీ నేత సుందర్ రాజు యాదవ్, బీసీ నేతలు, కుల సంఘాల బాధ్యులు పరిశీలించారు.

బాలికలు మంచి కెరీర్ ఎంచుకోవాలి

- ఐఏఎస్ అధికారి కె.నిఖిల



డిగ్రీ కళాశాలలో పరిశీలిస్తున్న ఐఏఎస్ నిఖిల

జనగామ రూరల్: బాలికలు మంచి కెరీర్ ఎంచుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఐఏఎస్ అధికారి కె.నిఖిల అన్నారు. బాలికల వసతి గృహాల్లో మహిళా ఐఏఎస్ అధికారులు నిద్ర చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో మంగళవారం రాత్రి పట్టణంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆమె హాస్టల్ నిద్ర చేశారు. కళాశాలలోని ల్యాబ్‌లు, ఆవరణలోని ఆర్నమెంటల్ గార్డెన్, కిచెన్ గార్డెన్, క్లాస్ రూంలు, డార్మెటరీలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందుతున్న ఎమినిటీస్ సూట్ కేస్, బెడ్డింగ్ మెటీరియల్, యూనిఫాం, షూస్, స్పోర్ట్స్‌డ్రెస్, ట్రాక్‌సూట్, బుక్స్, కాస్మోటిక్స్, డైనింగ్ హాల్ నిర్వహణ గురించి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. మెనూ ప్రకారం విద్యార్థులకు చికెన్, మటన్, కోడిగుడ్లు, పండ్లు, స్నాక్స్ అందించాలన్నారు. కెఫిన్ టెక్ సీఎస్ఆర్ ఫండింగ్ సహకారంతో కళాశాలకు స్మార్ట్‌బోర్డ్, ప్రొజెక్టర్స్, ఏసీలు, కంప్యూటర్ ల్యాబ్ రినోవేషన్‌లో భాగంగా 30 అదనపు కంప్యూటర్లు, విద్యార్థులకు స్టడీ చేర్లు, టేబుళ్లు, ఆర్వో ప్లాంట్ ఇతర ఫర్నిచర్ సమకూర్చడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సంధ్యారాణిని అభినందించారు. విద్యార్థినుల ఆరోగ్య విషయంలో మరింత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. యోగా, మెడిటేషన్‌పై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పోటీ పరీక్షల కోసం విద్యార్థినులను సిద్ధం చేయాలని ఈ సందర్భంగా ఫ్యాకల్టీకి చెప్పారు.

మిలిటరీ వ్యూహాల్లో టెక్నాలజీ కీలకం

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: మిలటరీ వ్యూహాల్లో కంప్యూటర్ టెక్నాలజీ కీలక భూమిక వహిస్తుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. బుధవారం యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆవిభాగం సెమినార్‌హాల్‌లో నిర్వహించిన 'టూ వీక్స్ ఇంటెన్సివ్ ప్రోగ్రాం ఫ్రమ్ ఎక్సెల్ టూ పవర్ బీ ఫర్ ఎన్‌సీసీ జవాన్స్' ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలద్వారా ఇంజనీరింగ్, కంప్యూటర్ నైపుణ్యాలు మెరుగుపడుతాయన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి రమ మాట్లాడుతూ.. రెండు వారాల పాటు రోజూ ఉదయం రెండు గంటలు థియరీ, సాయంత్రం రెండు గంటలు ప్రాక్టికల్స్ కృత్రిమ మేధా, ఎక్సెల్ పవర్ బీ ఐ డేటా అనాలిసిస్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సింథల్ రామదురై మాట్లాడుతూ.. రెండు వారాల శిక్షణద్వారా సామర్థ్యాల పెంపు, వాల్యూ అడిషన్ జరుగుతుందన్నారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేశ్‌లాల్, బీఓఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ మంజుల, డాక్టర్ రమేష్, డాక్టర్ నీలిమ, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ రవి, సునేహార్ విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

- పెద్ది వెంకటనారాయణ



క్రీడాకారులతో పెద్ది వెంకటనారాయణ, తదితరులు

కాజీపేట రూరల్: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమని ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్, జనగామ జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేడియంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో లోకో 11 జట్టు– ఇంజనీరింగ్ జట్టు మధ్య క్రికెట్ పోటీని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మాట్లాడుతూ.. ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ ఆర్‌డీఎం జట్టు–రైల్వే ఇన్‌స్టిట్యూట్ జట్ల మధ్య పోటీని ప్రారంభించి మాట్లాడారు. మొదటి మ్యాచ్‌లో రైల్వే ఇన్‌స్టిట్యూట్ జట్టుపై ఆర్‌డీఎం జట్టు జట్టు గెలిచింది. రెండో మ్యాచ్‌లో లోకో -11 జట్టు విజయం సాధించింది. రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్, కల్చరల్ విభాగాల ఇన్‌చార్జ్ దారవత్ రఘు, క్రికెట్ క్రీడల విభాగాల ఇన్‌చార్జ్ పి.ప్రశాంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవుని గుట్టపై రాతి కట్టడాలు



పంచముఖ పువ్వు, గుర్రం తల, కోట గడి మెట్లు

- గుర్తించిన పరిశోధనా బృందం



రాతి కట్టడాలను చూపుతున్న పరిశోధనా బృందం

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం బంధాల అటవీ ప్రాంతంలోని దేవుని గుట్టపై పురాతన రాతి కట్టడాలను గుర్తించిన ట్లు పరిశోధనా బృందం సెంటర్ డైరెక్టర్ కాకనర్సింగారావు, అసోసియేట్ డైరెక్టర్ కొర్నెబెల్లి గణేశ్ తెలిపారు. బుధవారం కామారం సమ్మక్క, సారలమ్మ ఆర్కియాలజీ ఇండిజినస్ పరిశోధనా బృందం కోటను సందర్శించింది. పురాతన కోటలను రాజ్య పాలన ఆనవాళ్లు, పురావస్తు వస్తువులను గుర్తించినట్లు బృందం సభ్యులు వెల్లడించారు. గుట్ట కింద మూడు కిలోమీటర్ల విస్తరణలో గుట్టను ఆనుకుని కోట గడి నిర్మాణం చేశారన్నారు. దీని పరిధిలో పురాతన శివలింగం, నంది నాగుపాము బొమ్మలు, ధ్వంసమైన చిన్న ఆలయం ఉందన్నారు. శిథిలాలలో ఉన్న రాళ్లపై లిపిని అధ్యయనం చేయగా నాలుగు పలకల బండలపై నాలుగో గొట్టును తెలియ చేసే నాలుగు గుర్తులు, రాజ్య ముద్ర దీర్ఘ చతురస్రాకారం బండపై చెక్కారన్నారు. ఇంకొక చిన్న కోట గడిలో ఇప్ప చెట్టు కింద గుర్రం తల పోలిన రాయిపై ఐదు డబ్బాలు సమ్మక్క తల్లి అయిదో గొట్టు అని తెలుపగా ఇంకొక పక్క నాలుగు డబ్బాలు నాలుగు గొట్టు కోడలునీ తెలియ చేస్తుందన్నారు. ఇది సింధు నాగరికతలో మోనో లోగో శిలబిక్ రూపంలో ఒక కొమ్ము దుప్పిని పోలిన ఆకారంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. నాగులమ్మ పడిగా బొమ్మ, నెమలి ఈకలు పెట్టుకున్న మహిళ బొమ్మ గుర్తించామని, రాయిపై ఈ కోట ఎలా ఉందనే విషయంపై మ్యాప్ కూడా గుర్తించామన్నారు. పెద్ద రాళ్ల సాయంతో అయిదు వందల మీటర్ల దీర్ఘ చతురస్రాకారంలో ఈ కోట గడి ఉందన్నారు. దీని లోపల 60 పురాతన రోళ్లను గుర్తించామన్నారు. పురాతన రాజ్యాల ప్రజలు ఇక్కడ వడ్లు దంచేవారన్నారు. ఈ కోటకు నాలుగు పక్కల ద్వారాలు ఉన్నాయన్నారు. నీటి బావి నీటి గోళాలు, ఇంటి స్థలం, వస్తూ సామగ్రి ఆనవాళ్లను గుర్తించినట్లు తెలిపారు. గుట్ట కింద కూడా 98 మీటర్ల పొడవు 15 మీటర్ల వెడల్పులో రచ్చ బండ ఉందన్నారు. ఇందులో కూర్చోవడానికి 56 రాళ్లు నాలుగు వరుసలుగా ఉన్నాయన్నారు. కానీ గుప్త నిధుల పేరిట నిత్యం పురాతన కట్టడాలను ధ్వంసం చేస్తున్నారని గుర్తించామన్నారు. ప్రభుత్వం రక్షణకు కృషి చేయాలన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

- త్రిదండి చినజీయర్ స్వామి



మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

ఖిలా వరంగల్: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు. బుధవారం వరంగల్ ఉర్సుగుట్ట నానిగార్డెన్‌లో వడుప్సా(ట్రస్మా) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు, ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్ అధ్యక్షతన పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలన్నారు. మానసిక ఒత్తిడికి లోనుకాకుండా విషయ పరిజ్ఞానం తెలుసుకోవాలన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని తెలిపారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, ట్రస్మా రాష్ట్ర ప్రతినిధులు కోడెం శ్రీధర్, అంకతి వీరస్వామి, బిల్లా రవి, జ్ఞానేశ్వర్‌సింగ్, సతీశ్, చక్రపాణి, రాజు తదితరులు పాల్గొన్నారు.